మదనపల్లి ఆర్‌డిఒగా హరిప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి నూతన ఆర్‌డిఒగా హరిప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఆర్‌డిఒగా పని చేస్తున్న ఎం.ఎస్.మురళి బదిలీపై వెళ్లారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల నేపథ్యంలో కర్నూలు ఆర్‌డిఒగా పని చేస్తున్న హరిప్రసాద్ మదనపల్లి ఆర్‌డిఒగా విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ చారిత్రిక నేపథ్యం ఉన్న మదనపల్లికి ఆర్‌డిఒగా రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఇక్కడ విధులు నిర్వర్తించడం గర్వంగా ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వరం న్యాయం చేస్తానని పేర్కొన్నారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

హామీలను అమలు చేయాలి

డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

- డిఇఒ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా
- రూ.10 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మధ్యాహ్న భోజన పథక కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అన్నమయ్య జిల్లా విద్యా శాఖ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఏడీ నరసింహులుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ, అధికారంలోకి రాగానే మధ్యాహ్న భోజన పథక కార్మికులకు రూ.10 వేల వేతనం చెల్లిస్తానని జగన్ హామీ ఇచ్చి నేటికీ ఐదేళ్లు పూర్తి కావస్తుందన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో నిత్యావసర ధరలు 400 శాతం పెరిగాయని, విద్యార్థికి ఇచ్చే మెనూ ఛార్జీలు కాని, కార్మికులకు ఇచ్చే వేతనాలు గానీ జగన్ ప్రభుత్వం పెంచకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. బిల్లులు నెలల తరబడి పెండింగులు పెడుతున్నారని, దీంతో వేలాది రూపాయలు వంట కోసం చేసిన అప్పులు తీర్చలేక కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. స్వచ్ఛంద సంస్థల్లో పనిచేసే ఆయమ్మలకు ప్రభుత్వం రూ. 3వేలు వేతనం ఇస్తుంటే, సంస్థలు మాత్రం 1500 మాత్రమే చెల్లించడం దారుణమని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అన్నమయ్య జిల్లా భాధ్యులు డి.భాగ్య లక్ష్మి మాట్లాడుతూ తక్షణ పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూఛార్జీలను ప్రతి విద్యార్థికీ రూ. 20కు పెంచాలని, కార్మికులపై రాజకీయ వేధింపులు అరికట్టాలని, ప్రమాద బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతీనెల 5వ తేదీనే వేతనాలు, బిల్లులు గ్యాస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికులు సంఘం నాయకులు యం. జయన్న, అమీర్, రఫీ, రమణ, ఫారిజాన్, గౌసియాబీ పాల్గొన్నారు.

వార్షిక లక్ష్యాలను సాధించాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటి నుంచి సంసిద్ధతకు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి ఆర్‌డిఒలు, ఇఆర్‌ఒలు, నోడల్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు మున్సిపల్ కమిషనర్లు, మెడికల్, ఐసిడిఎస్, డ్వామా, పిఆర్, ఆర్డబ్ల్యుఎస్ అధికారులతో వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బదిలీపై జిల్లాకు నూతనంగా వచ్చిన అధికారులు, సిబ్బంది అందరూ దాదాపు విధుల్లో చేరారని చెప్పారు. విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడూ జారీ చేసే మార్గదర్శకాలను ప్రాథమిక నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలను సరిగా అర్థం చేసుకొని, వాటిని అమలు చేయడం వల్ల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించగలుగుతామని చెప్పారు. శిక్షణలో ఆయా అంశాలను శ్రద్ధగా విని, ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులను అడిగి సందేహాన్ని వృత్తి చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి అధికారీ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల సంఘం తాజాగా జారీ చేసిన రిటర్నింగ్ అధికారి పుస్తకాన్ని ఎన్నికలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఎన్నికల విధుల్లో పాల్గొనేవారు ప్రతి అధికారి క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు అందిన క్లెయిమ్స్‌లో ఇంకను సుమారు 7 వేల ఫారాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పోలింగ్ కేంద్రం వారీగా బిఎల్‌ఒలతో తనిఖీ చేసి తగిన నివేదికలు పొంది పరిష్కరించాలని ఇఆర్‌ఒలను ఆదేశించారు. ఈ నెలాఖరులో రిటర్నింగ్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. ఓటరు జాబితాపై పత్రికల్లో వచ్చే అంశాలను కూడా ప్రాధాన్యతగా తీసుకొని వాటిపై తీసుకున్న చర్యలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో 68వేలు జగనన్న ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్స్ చేయాల్సి ఉందని, దీనికి అత్యంత ప్రాధాన్యత నుంచి వెనువెంటనే పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలని, అవసరమైన ప్రతి కుటుంబానికి వైద్య సేవలు అందేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఉపాధి హామీలో భాగంగా జిల్లాలోని అవసరమైన ప్రతి కుటుంబానికి 100 రోజుల పనిని తప్పనిసరిగా కల్పించాలన్నారు. మహిళా శిశు సంక్షేమం ద్వారా జగనన్న గోరుముద్ద పౌష్టికాహారం చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందేలా చూడాలన్నారు. ఇంటర్, 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ రావు, శ్రీలేఖ, ఆర్‌డిఒలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టిడిపి సర్పంచ్‌లు హౌస్ అరెస్టు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కమిటీ పిలుపుమేరకు మంగళవారం సర్పంచ్‌లు చలో అసెంబ్లీ ముట్టడికి సర్పంచ్‌లు వెళ్లకుండా సోమవారం పోలీసులు హౌస్ అరెస్టులు చేశారు. ప్రభుత్వ ఒత్తిళ్లకు పోలీసులు సర్పంచ్‌లను హౌస్ అరెస్ట్ చేయడం దారుణమైన చర్యగా కడప ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, కోనంపేట సర్పంచ్ లక్ష్మీనారాయణ ఖండించారు. చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళుతున్న సర్పంచ్‌లను ముందస్తుగా కోనంపేట సర్పంచి లక్ష్మీనారాయణ, దపేపల్లి సర్పంచ్ దాసరి కేషవయ్యను హౌస్ అరెస్టు తగదన్నారు. సర్పంచ్‌ల ఇంటి వద్దకు పోలీసులు మకాం వేసిన వేశారన్నారు. తన కోడలు శ్రీమంతం కార్యక్రమంలో భాగంగా పనులు ఉన్నాయన్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. చలో అసెంబ్లీ ముట్టడికి కార్యక్రమానికి వెళ్తారనే భయంతో పోలీసులు ముందస్తుగానే వచ్చి హౌస్ అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. తెలుగుదేశం సర్పంచ్‌లను మాత్రమే టార్గెట్ చేశారన్నారు. సర్పంచ్‌ల హక్కులను చెప్పుకొనే స్వేచ్ఛ కూడా సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కాలరాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు.

హౌస్ అరెస్టులో లక్ష్మీనారాయణ

పార్లమెంట్‌లో వాల్మీకుల బిల్లు ప్రవేశపెట్టాలి

ప్రజాశక్తి-మదనపల్లి

వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ తీర్మానం బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలలో వాల్మీకి బోయల ఎస్టీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ నెల 6 నుంచీ ప్రారంభం కానున్న ఎపి అసెంబ్లీ సమావేశాలలో మరోసారి వాల్మీకి బోయల ఎస్టీ రిజర్వేషన్ బిల్లుపై కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చే విధంగా చర్చించాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. వాల్మీకి బోయల గిరిజన నిర్వహించాలని కోరుతున్న ఎన్నికల ప్రచారానికి వచ్చే రాజకీయ పార్టీలను, నాయకులను అడ్డుకుంటామని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పొదల నరసింహులు హెచ్చరించారు. కార్యక్రమంలో విఆర్‌ఎస్‌ఎస్ నాయకులు బొగ్గిటి కృష్ణమూర్తి, తరిగొండ రఘు నాగినేని గోవిందు, నిమ్మనపల్లె లక్ష్మన్న, బొగ్గిటి మధుబాబు, చెన్నం శ్రీరాములు, మారే కృష్ణమూర్తి, అక్కులమ్మ, మణెమ్మ, వేంకటరమణ, కోటవారిపల్లి శ్రీనివాసులు, పొదల రెడ్డెప్ప, నిమ్మనపల్లె, మదనపల్లె, రామసముద్రం, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, పుంగనూరు, వాల్మీకిపురం, పీలేరు నుంచీ వాల్మీకి కులపెద్దలు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి షేక్‌బాబా ఫక్రుద్దీన్

మార్చి 7న లోక్ అదాలత్ : జడ్జి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మార్చి 7వ తేదీన జరగబోయే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కడప సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ బాబా ఫక్రుద్దీన్ అన్నారు. రాజంపేట ఉపకారాగారంలోని ఖైదీలను సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం కోర్టులో న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో సమావేశమయ్యారు. లోక్ అదాలాత్ విజయవంతంలో కక్షిదారులకు మేలుజరిగేలా న్యాయవాదులు చొరవ తీసుకోవాలన్నారు. లోక అదాలాత్‌లో న్యాయవాదుల సమస్యలు జిల్లా జడ్జి దృష్టికి తీసుకెళ్లగలనన్నారు. కార్యక్రమములో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్, ఏ పి పి రెహనా రసూల్, న్యాయవాదులు లక్ష్మీనారాయణ, కృష్ణకుమార్, సుదర్శనరెడ్డి, వెంకటసుబ్బయ్య, వెంకటస్వామి, కరుణాకరరాజు పాల్గొన్నారు.

10న కారు వేలం

ప్రజాశక్తి-రామాపురం

మద్యం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన కారును ఈనెల 10న వేలం వేయనున్నట్లు రామాపురం ఎస్ఐ బిఎల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10న ఉదయం 10:30 గంటలకు పోలీస్ స్టేషన్ ఆవరణంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనవచ్చునని తెలిపారు.

10న కలకడ మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కలకడ

మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 10వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10:30కు ఎంపిపి శ్రీదేవి రవికుమార్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు సచివాలయ సిబ్బంది తమ తమ నివేదికలతో హాజరుకావాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీల్లో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ విద్యార్థులు పలమనేరు సమీపంలోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయిలో అగస్త్య, సిన్ఫోసిస్ వారి ఆధ్వర్యం అన్వేషణ-2024 పోటీలలో కళాశాలలో బి.టెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగానికి చెందిన రెండవ సంవత్సర విద్యార్థులు ఎస్.బఱహీర్, అనికేత్ అరుణ్ సస్మాల్, పి.అన్వార్ అలీఖాన్‌లకు మొదటి బహుమతిగా రూ.15 వేల నగదు బహుమతి లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులను కరెస్పాండెట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి అభినందనలు తెలియజేశారు.

ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

ఎంపిడిఒగా రామచంద్రారెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - వీరబల్లి

వీరబల్లి మండల ఎంపిడిఒగా రామచంద్రారెడ్డి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఒ మల్లీశ్వరి బదిలీపై కర్నూలుకు వెళ్లారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిష్పక్షపాతంగా ప్రజలకు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చంద్రుడు, పద్మావతి సెక్రెటరీ పాల్గొన్నారు.

గాలివీడు ఎంపిడిఒగా శ్రీనివాసులు..

మండల ఎంపిడిఒగా పి.డి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా వేపరాల నుంచి గాలివీడుకు బదిలీ అయ్యానని పేర్కొన్నారు. మండలంలో 17 పంచాయతీల్లోని సచివాలయాలకు, కార్యదర్శులకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ శేఖర్ నాయక్ నందలూరు బదిలీపై వెళ్లారు.

ఇకెవైసి తప్పనిసరి : ఎఒ

ప్రజాక్తి-రామాపురం

2023 రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తమ పంటలను ఈనెల 15 లోపు పంట నమోదుతో పాటు ఇకెవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగమణి తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పంట సాగు చేసిన రైతులు పంట నమోదుతో పాటు ఇకెవైసి తప్పనిసరిగా గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో నమెదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. రబీ సీజన్‌లో వేరుశనగ,వరి, నువ్వులు, ఉలవ, పొద్దు తిరుగుడు, అలసంద, అనప. కూరగాయలు సాగుచేసిన పంటలకు 75 శాతం ఇకెవైసి నమోదు చేసినట్లు మిగతావారు. తప్ప కుండా ఈ నెల 15 లోపు రైతు భరోసా కేంద్రాలలో ఈ కేవైసీ చేయించుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే పంట నష్టం వారికి వర్తి స్తుందన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఒ నాగమణి

బస్టాండ్‌లోకి వాహనాలు రాకుండా అడ్డుకున్న అధికారులు

బస్టాండ్‌లో ప్రయివేట్ వాహనాలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

బస్టాండ్‌లో ప్రయివేట్ వాహనాలకు అడ్డుకట్ట పడింది. ద్విచక్ర, ఇతర వాహనాలు బస్టాండ్‌లోకి రానీవకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. బస్టాండ్‌లో బస్సు నిలవడానికి స్థలం ఎక్కడ? అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 2న వచ్చిన కథనానికి ఆర్‌టిసి, పోలీస్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ద్విచక్ర వాహనాలను బస్టాండ్‌లో నిలపకుండా అడ్డుకున్నారు. ఇటీల బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ వెంకటప్రసాద్ కంట్రోలర్ బిటి నాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్టాండ్‌లో ఉండి ప్రయివేట్ వాహనాలను అడ్డుకున్నారు. ఎవరైనా బస్టాండ్‌లో వాహనాలు ఉంచితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విలువలతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి-చిన్నమండెం

విలువలతో కూడిన విద్య విద్యార్థులకు ఎంతో అవసరమని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రమేష్ అన్నారు. సోమవారం పాఠశాలలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా సరైన సమయంలో ఉపాధి పొందవచ్చునని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్ తర్వాత ఏ ఉన్నత విద్యను అభ్యసిస్తే ఎటువంటి ప్రయోజనాలు ఉపాధి పొందవచ్చునని రిసోర్స్ పర్సన్ సుబ్బారాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్‌పిఒ నరసింహులు రామరాజు గోపాల్ ఉపాధ్యాయులు విద్యార్థులు, పాల్గొన్నారు.

బాధ్యతగా ప్రజా సమస్యలు పరిష్కరించాలి : కిషోర్

ప్రజా శక్తి రాయచోటి

బాధ్యతగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జెసి ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, ఎస్‌డిసి శ్రీలేఖ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులపై ప్రజలలో నమ్మకం పెరగాలంటే జగనన్నకు చెబుదాం అర్జీలను ఎలాంటి ఆలస్యం లేకుండా సకాలంలో వేగవంతంగా పరిష్కరించాలన్నారు. నాణ్యతగా అర్జీలను పరిష్కరించడం అత్యంత కీలకమని చెప్పారు. రీ ఓపెన్ లేకుండా అర్జీలకు పరిష్కారం చూపించాలన్నారు. పెండింగ్ ఉన్న ఆర్జీలను అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మరో రెండు, మూడు వారాలు మాత్రమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉందని, ఆ తర్వాత ఎప్పుడైనా ఎన్నికల కోడ్ రావచ్చున్నారు. ఈ రెండు మూడు వారాలు కూడా ప్రజల సమస్యలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి బాధ్యతగా వాటి పరిష్కారానికి కృషి చేయాలని రెవెన్యూ డివిజన్, మండలాలలో కూడా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పటిష్టంగా ప్రాధాన్యతతో నిర్వహించాలని డివిజన్, మండల అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మాత్రమే కాకుండా ఏదైనా సమస్యతో ప్రజలు కార్యాలయాలకు వచ్చినపుడు వారి నుంచి సమస్యను ఓపికగా సావధానంగా ఆలకించాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులు

ముగిసిన ఐసిటి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని కొత్త బోయినపల్లె ఎస్‌జెఎస్‌ఎం ఉన్నత పాఠశాలలో సోమవారం ఇన్ఫర్మేషన్ అండ్ కమున్యూకేషన్ టెక్నాలజీపై ఉపాధ్యాయులకు ఇచ్చిన శిక్షణ తరగతులు ముగిసినట్లు ప్రధానోపాధ్యాయులు భారతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ మన జీవితంలోని ప్రతి అంశాన్ని, మనం పనిచేసే విధానం నుండి మనం కమ్యూనికేట్ చేసే, నేర్చుకునే విధానం వరకు మార్చిందన్నారు. ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం అనేది ఆధారపడిన పునాది అని, ఇది వ్యక్తులు డిజిటల్ సిస్టమ్‌లతో సమర్థవంతంగా ఇంటరాక్ట్ అయ్యేలా చేస్తుందనీ, ఈ శిక్షణా తరగతుల్లో తాము ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన అంశాలను చర్చించామన్నారు. ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ సమాచారాన్ని నిర్వహించడానికి, ప్రసారం చేయడానికి ఉపయోగించే విస్తృత సాంకేతిక పరిజ్ఞా నాన్ని కలిగి ఉంటుందని, నేర్చుకునే వనరులను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడం ద్వారా విద్య విప్లవా త్మకంగా మార్చిందని పేర్కొన్నారు. ఇ-లెర్నింగ్ ప్లాట్ ఫారమ్‌లు, వర్చువల్ క్లాస్‌రూమ్‌లు, ఆన్‌లైన్ కోర్సులు అన్ని వయసుల వ్యక్తులకు అనువైన అభ్యాస అవకాశాలను కల్పిస్తాయని తెలిపారు. ఎనిమిది మంది రిసోర్స్ పర్సన్స్‌తో ఈ కార్యక్రమంలో మొదటి రోజు రాజంపేట నియోజక వర్గం నుంచి రాజంపేట, నందలూరు మండలాలు, రైల్వేకోడూరు నియోజక వర్గం నుంచి కోడూరు, పుల్లంపేట, పెనగలూరు, ఓబులవారిపల్లి, చిట్వేల్ మండలాల 137 మంది గణిత శాస్త్ర ఉపాధ్యాయులు, రెండవ రోజు ఫిజికల్ సైన్స్ నుంచి 73 మంది, మూడవ రోజు బయాలజీ నుంచి 93 మంది శిక్షణ పొందారని పేర్కొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో రానున్న విద్యా సంవత్సరానికి గానూ 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కల్పన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 23వ తేదిలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష మార్చి 10న జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు https://apbragcet.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసూోవాలని కోరారు.

స్పర్శలేని మచ్చలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతి ఒక్కరూ స్పర్శలేని మచ్చలపై అవగాహన కలిగి ఉండాలని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి సూపర్‌వైజర్ సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని చింతపర్తి యూపి ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు ఉండడం వలన శరీరములో నరాలను దెబ్బతీసి చేతివేళ్లు, కాలి వేళ్లు వంకర పోవడం, అంగవైకల్యం రావడం వంటివి జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుధాకర్

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఒలంపియాడ్‌లో 'అన్నమాచార్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-నందలూరు

అబాకస్, వేదిక్ మాథ్స్‌లలో ఆర్‌కె ఒలంపియాడ్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభను కనపరిచిన శ్రీఅన్న మాచార్య అకాడమీ హైస్కూల్ విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ సమ్మెట శివప్రసాద్ సోమవారం అభినందించారు. రైల్వేకోడూరులో ఆదివారం జరిగిన పోటీలలో 17 పాఠశాలల నుంచి 400 మందికి పైగా విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. నందలూరు మండలం నుండి శ్రీఅన్నమాచార్య అకాడమీ హైస్కూల్ విద్యార్థులు 21 మంది పోటీలలో పాల్గొన్నారని వారిలో 8 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనపరచి ప్రథమ స్థానంలో ఇద్దరు, ద్వితీయ స్థానంలో ముగ్గురు, తృతీయ స్థానంలో ముగ్గురు, విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాంజనేయులు, డైరెక్టర్స్ మాడపూరి హేమలత, ఉమా మహేష్, ఉపాధ్యాయులు షఫీఉల్లా, శ్రవంతి, లక్ష్మి ప్రియాంక, శివకుమారి, గోపిక పాల్గొన్నారు.

వాలంటీర్ ఖాళీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కలకడ

ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ముడింవారిపల్లి సచివాలయ పరిధిలోని నవాబుపేట గ్రామ పరిధిలో ఒక వాలంటరీ ఫస్టు ఖాళీగా ఉన్నట్లు దీనిని ఒసి పురుషుల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాపిరెడ్డి గారిపల్లె సచివాలయం పరిధిలో ఉన్న ఎర్రకోటిపల్లిలో ఒక పోస్టు ఖాళీ ఉండటంతో బిసి మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖా స్తులను ఈనెల 6వ తేదీ నుండి స్వీకరించడం జరుగుతుందని, 7వ తేదీ నుండి 15 వరకు పరిశీలించిన జరుగుతుందని, 16, 17వ తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికైన అభ్యర్థులకు 18వ తేదీ సమాచారం ఇస్తామని తెలిపారు. 19వ తేదీన ఎన్నికైన అభ్యర్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి, 20వ తేదీన పోస్టింగులు ఇస్తామని పేర్కొన్నారు. అర్హతలు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

తహశీల్దార్‌గా రమాదేవి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె తహశీల్దార్‌గా రమాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేస్తున్న షేక్ మహమ్మద్ చాంద్ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా బదిలీపై తిరుపతి రూరల్‌కు వెళ్లారు. ఇక్కడికి అనంతపురం నుంచి బదిలీపై రమాదేవి వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని పేర్కొన్నారు. రెవెన్యూ పరంగా ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలో భూసమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

బి.కొత్తకోట తహశీల్దార్‌గా పుణ్యవతి...

బి.కొత్తకోట : మండలం నూతన తహశీల్దార్‌గా పుణ్యవతి పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం సత్యసాయి జిల్లా నుంచి ఆమెను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందు బాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధిలోభాగస్వామ్యమవుతానని పేర్కొన్నారు. పుణ్యవతికి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కలికిరి తహశీల్దారుగా విజయ కుమారి...

కలికిరి: నూతన తహశీల్దార్‌గా టి.విజయ్ కుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేస్తున్న భాగ్యలత అనంతపూర్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో అదే జిల్లా నుండి కలికిరికి బదిలీపై విజయ కుమారి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు.

రాజంపేట తహశీల్దారుగా ఇంబునాధన్...

రాజంపేట అర్బన్ : మండల తహశీల్దార్‌గా ఇంబునాధన్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.సుబ్రహ్మణ్యంరెడ్డి చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరుకు బదిలీపై వెళ్లగా అక్కడ పనిచేస్తున్న ఇన్బనాధన్ రాజంపేటకు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయం రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐ రాజేష్, విఆర్‌ఒలు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పెద్దమండ్యం తహశీల్దార్‌గా లక్ష్మీ నాయక్...

పెద్దమండ్యం : మండల తహశీల్దార్‌గా లక్ష్మి నాయక్ బాధ్యతలు చేపట్టారు, ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేస్తున్న రాము బదిలీపై ఒంటిమిట్టకు బదిలీల అయ్యారు. ఆయన స్థానంలో అనంతపూర్ జిల్లా పెద్దపప్పూరు మండలంలో బాధ్యతలు నిర్వహించిన లక్ష్మి నాయక్ పెద్దమండ్యం మండల తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డిటిలు రవి నాయిక్, గౌరీశంకర్, విఆర్‌ఒలు నావాజ్, నీలిమ, శ్రీరాములు, శ్రీనివాసులు నాయుడు, శివ శంకర, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకిపురం తహశీల్దార్‌గా ఖాతిజున్ కుప్రా...

వాల్మీకిపురం: మండల తహశీల్దార్‌గా ఖాతిజున్ కుప్రా బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా ధర్మ వరం డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఉన్న ఆమె బదిలీపై వాల్మీకిపురంకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజల నుంచి వచ్చే వివిధ రకాల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు.

పీలేరు తహశీల్దారుగా మహబూబ్‌బాషా...

పీలేరు: మండల తహశీల్దారుగా మహబూబ్ బాషా బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా, గుత్తి తాలూకా నుంచి బదిలీపై స్థానిక మండల రెవెన్యూ కార్యాలయానికి చేరుకున్న తహశీల్దారును డిటి విజయా రెడ్డి ఆధ్వర్యంలో రీసర్వే డిటి సుబ్రమణ్యం, ఆర్ఐ చాణిక్య, ఎఎస్ఒ రామ్మోహన్, రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. పీలేరు తహశీల్దారుగా పనిచేస్తున్న ధనుంజయులు కడప జిల్లాకు బదిలీ అయ్యారు.

తంబళ్లపల్లె తహశీల్దార్‌గా బ్రహ్మయ్య...

తంబళ్లపల్లి: రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్‌గా బ్రహ్మయ్య ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో అనంతపురంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఏవైనా రెవెన్యూ పరంగా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువారాలని పేర్కొన్నారు. తహశీల్దార్‌ను పలువురు సన్మానించారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా ప్రభుత్వం : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఐదుగురు అంధ, బదిర విద్యార్థులకు ఒకొక్కరికి రూ 54, వేలు విలువ చేసే లాప్‌టాప్‌లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా పేదలను ఆదుకుంటుందని, విభిన్న ప్రతిభావంతులకు కూడా వివిధ కార్యక్రమాలను అమలు చేస్తూ అండగా నిలుస్తోందన్నారు. ల్యాప్ టాప్‌లు పొందిన వారు పట్టుదలగా కృషితో బాగా చదువుకొని వాటిని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఒక్కొక్క విద్యార్థిని పరిచయం చేసుకొని వారికి అమూల్యమైన సలహాలను అందజేశారు. తమకు ఉచితంగా లాప్ టాప్ లు అందజేసిన కలెక్టర్‌కు ఈ సందర్భంగా విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కో-

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ఆర్డినేటర్, జిల్లా సెరికల్చర్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా విభిన్న ప్రతి భావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఆర్.వి.కృష్ణ కిషోర్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధే ధ్యేయం : ఎంపిపి

సిమెంట్ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపిపి బాబుల్‌రెడ్డి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని నాగలపురి గట్టు రెండవ వీధి, మూడవ వీధిలో సోమవారం ఎంపిపి ముద్ద బాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ నిధులు కింద రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. మండల పరిధిలో వీధిలైట్లు, విద్యుత్, నీటి సరఫరా మొదలగు సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే పరిశీకరించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాబోయేది వేసవికాలం కాబట్టి గ్రామ పంచాయతీలలో నీటికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులు ఆదేశించారు. బుధారపు సతీష్ ఇంటి నుండి శీపాల ఉమా మహేష్ ఇంటి వరకు గుంటి కొండయ్య స్వామి వీధి, కొమ్మూరు వీధి, లచ్చింపల్లి వీధి మొదలగు వీధులలో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసుల రెడ్డి, వైస్ ఎంపిపి పార్థసారథి, జడ్‌టిసి గీతారామనాదం, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నాగిరెడ్డి సుదర్శన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ రంగారెడ్డి, దండ్లపల్లి సర్పంచ్ మనీ, టి.కమ్మపల్లి ఎంపిటిసి జంగయ్య, వార్డ్ మెంబర్ విజయలక్ష్మి, షేక్ అలీ జహారాభి, పోలిచర్ల బాలసుబ్రమణ్యం, వీసం సిద్ధారెడ్డి, జై సింహా స్వామి, పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

వీరబల్లి:మండల పరిధిలోని గురప్పగారిపల్లి పంచాయతీ చమ్మర్తివాండ్లపల్లికు రూ.13 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులకు ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా నిరాధారణకు గురైన చమ్మర్తివాండ్లపల్లెకు రోడ్డుకు మోక్షం వచ్చిందన్నారు. రాజంపేట పార్లమెంటు సభ్యుడు మిథున్‌రెడ్డి సహకారంతో ఈ పనులు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ భర్త ఈశ్వరయ్య, శ్రీరాములరెడ్డి, కోనేటి సుబ్బరం రాజు, ముసల్రాజు అచ్చిరాజు పాల్గొన్నారు

సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపి రాజేంద్రనాథ్‌రెడ్డి

రోడ్డు నిబంధనలు పాటించకపోతే చర్యలు : సిఐ

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సిఐ మోహన్

ప్రజాశక్తి-కలికిరి

రోడ్డు భద్రత నియమాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని సిఐ ఆర్.మోహన్ ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. సోమవారం ఆయన పట్టణంలోని రోడ్డు నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నియమ నిబందనలను పాటించాలని, తమ ఆటోలకు సంబంధించిన రికార్డులను, డ్రైవింగ్ లైసెన్సును కలిగి ఉండాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఆటో డ్రైవర్లు మధ్యము సేవించి ఆటోలను నడుపరాదని, అధిక వేగం కూడదని, రేడియం స్టిక్కర్‌లను ఆటోలకు అన్ని వైపులా ఏర్పాటు చేసుకొని, ప్రమాదాలు జరుగకుండా అన్ని జాగ్రత్తలను తీసుకోవాలని సూచించినారు. రోడ్డు పైన ఎక్కడ పడితే అక్కడ ఆటోలను నిలపరాదని, ఇతర వాహనాలకు, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ప్రవర్తించాలని, ఆటోలో ఎక్కే ప్రయాణీకులతో దురుసుగా ప్రవర్తించకూడదని, అదే విదముగా అనుమానితులు ఎవరైనా తమ ఆటోలలో ప్రయాణిస్తే అట్టి వారి వివరాలను వెంటనే పోలీసులకు తెలుపాలని తెలియచేసినారు. పై నిబందనలను పాటించనివారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించినారు. కార్యక్రమములో ఎఎస్ఐ మధుసూదనాచారి, హెడ్‌కానిస్టేబుల్ మనోహర్, కలికిరి పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వైసిపికి చరమగీతం పాడుదాం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

త్వరలో రానన్న ఎన్నికలలో టిడిపి పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి శంకర్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం జయహో బిసి జనసభ సందర్భంగా రాగిమాన్ రచ్చ వద్ద నుండి ములకలచెరువు రోడ్డు వద్ద వరకు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వైసిపి దౌర్జన్య అరాచకపు పాలనకు చరమగీతం పాడాలన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. గతంలో తాను రెండు వేల కోట్ల నిధులు మంజూరు చేయించానని పేర్కొన్నారు. బిసిలను అన్ని రకాలుగా అనగ తొక్కి అక్రమ కేసులు బనాయించిన ఘనత వైఎస్‌ఆర్ పార్టీదేనని పేర్కొన్నారు. అధికారులు పోలీసులు ఎన్నికల సందర్భంగా తటస్థంగా వ్యవహరిస్తారని కార్యకర్తలు ఎవరు భయపడాల్సిన అవసరం లేదన్నారు. అత్యధిక మెజారిటీతో టిడిపి పార్టీని గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులు రెడ్డప్పరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి,

పట్టణంలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్

శ్రీనివాసులు, రామచంద్ర, జనసేన నాయకులు సాయినాథ్, నరసింహులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లను అరెస్టు చూపుతున్న పోలీసులు

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-ములకలచెరువు

పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడతూ మండలంలోని సోంపల్లి పంచాయతీ, బిల్లురివారిపల్లి వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందించారన్నారు. ఎఎస్ఐ నజీర్‌బాషా, తమ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసి వారి వద్ద రూ.24,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో సిబ్బంది సుబ్బు మహేష్ విజయ్ పాల్గొన్నారు.

దోబీఘాట్‌లను తొలగించడంపై విచారణ చేపట్టండి

ప్రజాశక్తి- ఎర్రగుంట్ల

నగర పంచాయితీ పరిధిలోని కదిరివారిపల్లి రోడ్డులోని దోబీ ఘాట్‌లను తొలగించడంపై విచారణ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణకు నగరంలోని రజకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. చందాలు వేసుకుని, కొంతమంది దాతల సాయంతో నీటి నిలువ కోసం నిర్మించుకున్న దోబీ ఘాట్‌లను తొలగించి ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. కదిరివారిపల్లె దారిలోని సబ్‌స్టేషన్ దగ్గర సర్వే నంబర్ 452 వంక పొరంబోకు స్థలంలో కులవృత్తికి దోబీ ఘాట్‌లు నిర్మాణం చేసుకున్నామని పేర్కొన్నారు. విచారణ చేసి తమకు న్యాయం చేయాలని రజకులు కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు నిర్జీ షరీఫ్, రజకులు ఎం.రాముడు, రామాంజనేయులు, చెంద్రాయుడు, బి.రాముడు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-బ్రహ్మంగారిమఠం

కేశాపురం సమీపంలోని యానాది కాలనీలో నిరుపేదలకు వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, సంస్థ ప్రతినిధులు ముత్తుముల రామతులసి, ఎ.జయరాం, టి.హరి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.14 లక్షలు

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి హుండీల లెక్కింపులో 66 రోజులకుగానూ రూ.14,05,372, అన్నదానం హుండీ ద్వారా రూ.14,753, 8 గ్రాముల 200 మి.గ్రా బంగారం, 520 గ్రాముల 340 మి.గ్రా వెండి వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుంద రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి క్రిష్ణతేజ, పాలక మండలి సభ్యులు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఎపిజిబి మేనేజర్ అశోక్ కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

ఖాళీల సంఖ్య పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఖాళీల సంఖ్యను పెంచి డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. సోమవారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో వేంపల్లె అక్షర బాలికల కళాశాల విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదిగో, ఇదిగో మెగా డిఎస్‌సి అంటూ ఊరించి నాలుగున్నర ఏళ్ల తర్వాత నిరుద్యోగుల చెవిలో పువ్వులు పెట్టిన ఘనత రాష్ట్ర ప్రభుత్వనికే దక్కిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రెండేళ్ల అప్రెంటిస్ విధానాన్ని తీసుకోరావడం ఏంటన్నారు. 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే 6100 భర్తీ అనడం నిరుద్యోగులను మోసం చేయడమే అన్నారు. ప్రభుత్వం తక్షణమే మెగా డిఎస్‌సిని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పేరు మార్పు

అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం దండ్లోపల్లి గ్రామమం డోర్ నెంబర్ 1-7ఎ కాపురస్తులు బత్తాల వెంకటేశ్వర్లు గారి కుమారుడనైన బత్తాల సురేష్ అను నేను ఈ దినం నుండి బత్తల సురేష్ తండ్రి బత్తల వెంకటేష్‌గా మార్చుకున్నాను.

అర్జీలను పరిశీలిస్తున్న తహశీల్దార్ అమరేశ్వరి

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు సంబంధించి దరఖాస్తులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఇన్‌ఛార్జి తహశీల్దార్ అమరేశ్వరి అన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓబనపల్లె గ్రామానికి చెందిన ప్రజలు కొంత మంది గ్రామంలో రేషన్ డీలర్ షాపు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని కోరారని తెలిపారు. ప్రస్తుతం వారు ఓబునపల్లె అరుంధతి వాడలో ఏర్పాటు చేసిన రేషన్ డీలర్ వద్ద రేషన్ తీసుకుంటున్నారని చెప్పారు. కిలోమీటరు దూరం వెళ్లి రేషన్ తీసుకునేందుకు ఇబ్బందిగా ఉందంటూ వారు పేర్కొన్నారని తెలిపారు, ప్రస్తుతం అరుంధతి వాడలోని రేషన్ షాపులో 553 రేషన్ కార్డులో ఉన్నాయని అందులో అరుంధతి వాళ్లకు చెందిన 309 రేషన్ కార్డులు ఉండగా, ఓబనపల్లె గ్రామానికి చెందిన 244 రేషన్ కార్డులు ఉన్నాయని, ఒక రేషన్ షాపుకు 1200 రేషన్ కార్డులు ఉంటాయని పేర్కొన్నారు. ఓమనపల్లి గ్రామానికి చెందినవారు రేషన్ తీసుకునేందుకు గల ఇబ్బందులను పరిశీలిస్తామని ఆమె వారికి తెలిపారు. స్పందనలో ఆర్ఐ రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌టియు నాయకులను సన్మానిస్తున్న మండల నాయకులు

ఎస్‌టియు నాయకులకు సన్మానం

ప్రజాశక్తి - పుల్లంపేట

ఎస్‌టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బుదారపు నరేంద్రనాథ్, ఉపాధ్యాయ వాణి జిల్లా కన్వీనర్ మునగపాటి శ్రీనివాసులు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్‌రెడ్డిలను మండల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్కృత పాఠశాల హెచ్‌ఎం చింతగింజల మురళి, ఎస్‌టియు మండల అధ్యక్షులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి వి.సిద్దయ్య, ఆర్థిక కార్యదర్శి శివరాం ప్రసాద్, నాయకులు అశోక్, గౌస్ పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడవద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలో 17 పంచాయతీల్లో ఎవరైనా సరే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని ఎస్ ఃఐ వెంకటేష్ హెచ్చరించారు. సోమవారం ఆయన పెద్దమండ్యం ఎస్ఐ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన రామంజనేయుడు బదిలీపై జిల్లా కేంద్రానికి వెళ్లారు. ఆయన స్థానంలో వెంకటేష్ ఎస్ఐగా బదిలీపై వచ్చారు. గతంలో వెంకటేష్ పెద్దమండ్యం, మదనపల్లె అర్బన్, రాయచోటి రూరల్ ఎస్ఐ పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో పేకాట, కోడిపందేలు, సారా నివారణపై ప్రత్యక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

తంబళ్లపల్లి ఎస్ఐగా శివకుమార్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి ఎస్ఐగా శివకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో గాలివీడులో పనిచేసే బదిలీపై వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఫిర్యాదులపై న్యాయం చేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలు లేకుండా నివారిస్తామన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో భాగంగా ప్రత్యేక నియమాలతో నేరాల అదుపుకు కృషి చేస్తానన్నారు.

నరేంద్రను సన్మానిస్తున్న టిడిపి, జనసేన నాయకులు

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : ఎన్ఆర్ఐ నరేంద్ర

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ప్రముఖ పారిశ్రామికవేత్త కొండ నరేంద్రను పట్టణంలోని బిసి కాలనీలోని నివాసముంటున్న సుమారు 40 బుడగ జంగమ కుటుంబాలు సోమవారం ఘనంగా సన్మానించారు. త్వరలో జరుగబోవు శాసనసభ ఎన్నికల్లో మా సంపూర్ణ సహకారం, మద్దతు అందజేస్తామని తెలిపారు. కొండ నరేంద్ర మాట్లాడుతూ బుడగ జంగమలకు అన్ని విధాలా అండగా ఉంటానన్నారు. వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారనిన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బండి వెంకటేశ్వర్లు, సంపతికోట కిట్టన్న, గట్టు చంద్ర, సయ్యద్, మంజు, వెంకటరమణ, రెడ్డప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడూరు అసెంబ్లీ స్థానానికి చీకటి చార్లెస్ దరఖాస్తు

కడప : కోడూరు అసెంబ్లీకి కాంగ్రెస్ పార్టీ తరపున అభ్యర్థిగా సోమ వారం విజయ వాడలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009 నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవలు చేస్తూ ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీగా, జిల్లా సేవాదళ్ చైర్మన్‌గా, 2017లో పిసిసి సభ్యునిగా, 2018 జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులుగా కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించానన్నారు. అధిష్టానం తనకు అవకాశం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముఖ్య ప్రకటన

ఇందుమూలముగా తెలియ జేయడం ఏమనగా మా కక్ష దారుడైన దళవాయిల రెడ్డన్న కుమారుడు జయదేవ ఇచ్చిన ఇన్స్ట్రక్షన్స్ మేరకు 15-12-2021 వ తేదీన ఈ క్రింద కనపరిచిన షెడ్యూల్ ఆస్తిని రూ .10 లక్షల ధర ఖరారు చేసుకుని ఆ దినమున రూ.2.50,000/- లు అడ్వాన్స్ తీసుకొని రాయచోటి టౌన్ పాత రాయచోటి లో ఉండే కీ" శేషులు గువ్వల శంకరయ్య కుమారుడు శేఖర్ అను అతనుకి మా కక్షి దారునికి అగ్రిమెంటు వ్రాయించి ఇచ్చి యున్నావు. మరల 12- 5- 2022వ తేదీన మా కక్ష దారుడు మరియు వి.తనూజ నుండి రూ. 5,50,000/-లు నగదుగా తీసుకొని మిగతా రూ.2,00,000/- లు సదరు షెడ్యూల్ ఆస్తి పైనా వన్ (బి) అడంగల్ వ చ్చిన తర్వాత ఇచ్చి రిజిస్టర్ చేసి ఇస్తానని అగ్రిమెంట్ వెనక ప్రక్కన ఎండార్స్ మెంట్ వ్రాయించి ఉండినావు. కావున మీరు 7-2- 2024వ తేదీన ఉదయం 10 గంటలకు నుండి సాయంత్రం 5 గంటల లోపల మీకు చెల్లించ వలసిన రూ.2,00,000/- లక్షలు తీసుకొని రిజిస్టర్ చేసి వలెను. అట్ల రాని యెడల కోర్టులో అగ్రిమెంట్ దాఖలు చేసి రిజిస్టర్ పొందగల వాడను అని మీకు నోటీసు మూలంగా తెలపడమైనది.

షెడ్యూల్

కడప డి.రాయచోటి సబ్ డి.కు చేరిన రాయచోటి గ్రామం అసైన్డ్ మెంట్ కానట్టి ఆస్తి వివరం సర్వేనెంబర్ 284/2 య. 5.66 సెంట్లు పైకి య. 1.88 1/2 సెంట్లు పైకి య. 0.62 సెంట్లు. ఇందుకు చెక్ బంది.తూర్పు చెంద్రాయుడు భూమి, పడమర గువ్వల పెద్ద పక్కిరప్ప భూమి, ఉత్తరం గువ్వల రామచంద్రయ్య భూమి, దక్షిణం గువ్వల పాపయ్య భూమి.

పి. రెడ్డయ్య, ఎం.ఎ, ఎల్.ఎల్.బి,
అడ్వకేట్,
రాయచోటి. అన్నమయ్య జిల్లా. సెల్:9493239117.